వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు

వార్డుల్లో రోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు

మిర్యాలగూడ, ఆగస్టు 14: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విధులకు హాజరైన వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రిలో ఇప్పటివరకు జ్వరాలతో ఎంతమంది వైద్య సేవలు పొదుతున్నారు. సౌకర్యాలను రోగులకు వివరించి సేవలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలలో ఆసుపత్రికి 99 మంది జ్వరంతో రాగా వారికి రక్తపరీక్షలు నిర్వహించగా వారిలో ముగ్గురికి డెంగ్యూ ఉన్నట్లు నిర్ధారించామని, వారందరికీ కూడా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌సమరద్, డీఈ వెంకన్న, శానిటరి ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేత, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి పరామర్శ

మాజీ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్యను పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, ఆగస్టు 14 :మండలంలోని బ్రాహ్మణవెల్లెంల మాజీ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యాదయ్య కు టుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు నీటి విడుదల

ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

నార్కట్‌పల్లి, ఆగస్టు 14 : మండలంలోని బ్రాహ్మణవెల్లెంల నుంచి ఉదయ సముద్రం ప్రాజెక్టులోకి అధికారులు బుధవారం నీటిని వదిలారు. ప్రాజెక్టు లోని పంప్ హౌస్ మోటార్ల పనితీరును పరిశీలించారు. ట్రయల్ రన్‌లో భాగంగా గంటసేపు ఒక పంపు ద్వారా నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేతులమీదుగా ట్రయల్ రన్‌తో విజయవంతం చేశారు. అప్పుడు ప్రాజెక్టు కింద రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సాగర్ ఆయకట్టులో నీరు లేక పోవడంతో అప్పుడు ఉదయ సముద్రం ప్రాజెక్టు ప్రారంభించలేకపోయారు. ఇప్పుడు వర్షాలు సమృద్ధిగా రావడంతో సాగర్ ద్వారా నీరు విడుదల కావడంతో ఈ నెలాఖరులో ఉదయ సముద్రం ప్రాజెక్టును ట్రయల్ రన్ చేయనున్నట్లు తెలుస్తున్నది.

ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలి

● ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ ప్రతినిధి కృష్ణారెడ్డి

నేత్రదానం పత్రాలను అందజేస్తున్న ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి

రామగిరి, ఆగస్టు 14: ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఇనిస్టిట్యూట్ ప్రతినిధి టి.కృష్ణారెడ్డి సూచించారు. ఎంజీయూలో బుధవారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధ్యాపకులకు నేత్రదాన అవగాహన సదస్సు నిర్వహించారు. నేత్రదానంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. అనంతరం నేత్రదానం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ మారం వెంకటరమణరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ నీలకఠం శేఖర్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించారు. భారత దేశ స్వాతంత్ర్య యోద్యమం, సమరయోధుల పాత్రపై వివరించారు.

జాతీయ జెండా నిర్మాణంలో రాజకీయం తగదు

● బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇలియాస్‌ఖాన్

నిధుల మంజూరు పత్రం చూపిస్తున్న ఇలియాస్‌ఖాన్

మిర్యాలగూడ, ఆగస్టు 14 : పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న జాతీయ జెండా స్థూపం నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడం తగదని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండీ. ఇలియాస్‌ఖాన్ అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ జెండాల నిర్మాణాల్లో భాగంగా నాటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ మిర్యాలగూడలో రూ.20 లక్షలతో జాతీయ జెండా నిర్మాణానికి సంకల్పించారన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన వంద ఫీట్ల జాతీయ జెండా స్థూపం నిర్మాణ పనులను ప్రస్తుతం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆ జెండా స్థూపం ఆవిష్కరణకు కౌన్సిలర్లను ప్రోటోకాల్ ప్రకా రం ఆహ్వానించకపోవడం దారుణమన్నారు. ప్రోటాకాల్ పాటించి అన్ని పార్టీల కౌన్సిలర్లను జాతీయ జెండా ఆవిష్కరణకు ఆహ్వానించాలన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

హాలియా, ఆగస్టు 14 : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని మండలంలోని చింతగూడెం గ్రామంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాములు గౌడ్, కాసాని సత్తయ్య, వడ్డగోని వెంకన్న, కాట్నం సైదులు, నవీన్, రామలింగం, శివ, నర్సింహ, రామయ్య, వెంకన్న, సైదయ్య తదితరులున్నారు

గ్రామ సమస్యలను పరిష్కరించాలని వినతి

అడవిదేవులపల్లి, ఆగస్టు 14: మండలకేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ యువత ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మురుగుకాల్వల నిర్వహణ లోపంతో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వీధి కుక్కల బెడద కూడా తీవ్రంగా ఉందని, కొన్ని కాలనీల్లో వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని పేర్కొన్నారు.వినతిపత్రం అందించిన వారిలో సైదయ్య, జానీపాషా, అనిల్‌కుమార్, వంశీ, శ్రీనివాస్, సతీశ్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత తెలంగాణ కోసం పాటుపడాలి

● జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

చిట్యాల: డ్రగ్స్ నియంత్రణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

చిట్యాల, ఆగస్టు 14 : డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లికి చెందిన విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోదరెడ్డి, ఫౌండేషన్ల చైర్మన్లు అనుముల శ్రీనివాసు, మోత్కూరు శ్రీనివాస్, డాక్టర్ తోట నర్సింహాచారి, బూరుగు గోపీ కృష్ణ, కూరెళ్ల నర్సింహులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషిచేయాలి

రామగిరి : మాదక ద్రవ్యాల నియంత్రణకు అందరూ కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని డైట్ సమావేశ మందిరంలో బుధవారం పాఠశాల విద్యార్థులకు 'మాదక ద్రవ్యాల నియంత్రణ' అనే అంశంపై జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. మండలాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఉపన్యాస, వ్యాసరచన, పాటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ నారాయణరెడ్డి బహుమతులు అందజేస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

పాటల పోటీల్లో .. ప్రథమ టి.హేమశ్రీ 9వతరగతి ప్రభుత్వ బాలిక పాఠశాల ఆర్‌పీ రోడ్డు నల్లగొండ, ద్వితీయ జె.పవన్ 7వతరగతి జడ్పీ, హైస్కూల్ వీటీనగర్(మాల్) , తృతీయ బహుమతి కె.సిద్ధిత 10వతరగతి, జడ్పీ హైస్కూల్ ఎల్లారెడ్డి గూడెం

వ్యాసరచన పోటీల్లో ..ప్రథమ టి.సాదృశ్య 10వ తరగతి జడ్పీ హైస్కూల్, పాల్వాయి గుర్రంపోడు, ద్వితీయ బహుమతి వై. భార్గవి 10వ తరగతి, జడ్పీ హైస్కూల్, కట్టంగూర్ , తృతీయ టి.రాధిక 10వ తరగతి మోడల్ స్కూల్ వల్లాల, శాలిగౌరారం

ఉపన్యాస పోటీల్లో .. ప్రథమం బి.స్పం దన 10వ తరగతి, జడ్పీ హైస్కూల్, కొండమల్లేపల్లి, ద్వితీయం కె.సురేశ్ 10వతరగతి డైట్ పాఠశాల నల్లగొండ, తృతీయం ఎన్.హన్సిక 10వతరగతి, గాంధీ హైస్కూల్ చండూర్, నల్లగొండ

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మిర్యాలగూడ : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని షీటీమ్ ఎస్ఐ కోటే శ్ అన్నారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం : మండల కేంద్రంలోని గీతాంజలి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వద్దకు ర్యాలీ నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, కరస్పాండెంట్ పరమేశ్‌రావు. ప్రభంజనం పాల్గొన్నారు.

శాలిగౌరారం : ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ, విద్యార్థులు

తరగతి గదుల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

● డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నకిరేకల్ : జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మాణ పనుల వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నకిరేకల్, ఆగస్టు 14 : జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను డీఆర్డీఓ ఎర్రబెల్లి శేఖర్‌రెడ్డి ఆదేశించారు. నకిరేకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణ పనులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. బాలయ్య, డీఈ కొండయ్య, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ నాగయ్య, ఐకేపీ ఏపీఎం నరహరి, ఏపీఓ రమణయ్య, ఏఈ సంపత్, సీసీ కొండ మట్టయ్య, హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పోస్టల్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామగిరి, ఆగస్టు 14: తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆశాఖ అధికారి నర్సింహ, ఎస్పీఎం రమాదేవి కోరారు. నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ పోస్టాఫీసులో బుధవారం ప్రజలకు పోస్టల్ పొదుపు పథకాలైన రికరింగ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన, సేవింగ్, పీపీఎఫ్, గ్రామీణ తపాలా జీవిత బీమా వంటి వాటి ఉపయోగాలను వివరించారు. అందరూ పోస్టాఫీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తపాలా అధికారులు, సిబ్బంది శ్రీకాంత్, బుచ్చిరెడ్డి, రమేశ్, ఎస్‌డీ. కుర్షీద్, రజనీకాంత్, సంతోష్, మహేశ్వరి, వెంకన్న పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాకు అపూర్వ స్పందన

● 22 మంది ఉద్యోగాలకు ఎంపిక

జాబ్‌మేళాలో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 14: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాకు ఆపూర్వ స్పందన లభించిందని జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ సామ మాధవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేళాకు ఐదు ప్రముఖ కంపెనీలు పాల్గొనగా 117 మంది అభ్యర్థులు హాజరైనట్లు వివరించారు. వీరిలో 56 మంది ప్రాథమిక ఎంపికకగా కేఎల్ గ్రూప్ -9 ,అన్నపూర్ణ ఫైనాన్స్ లిమిటెడ్-2, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ -3, వెస్టీజ్ -8 సంస్థల్లో మొత్తం 22 మంది ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు

కృష్ణవేణి స్కూల్‌లో బోనాలు

నకిరేకల్ : గ్రామదేవతలకు బోనం సమర్పించేందుకు వివిధ వేషధారణలో వెళ్తున్న విద్యార్థులు

త్రిపురారం: బోనాలతో వెళ్తున్న మహిళలు

నకిరేకల్, ఆగస్టు 14 : పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్‌లో బుధవారం బోనాల పండుగ నిర్వహించుకున్నారు. స్కూల్ యాజమాన్యం గ్రామదేవతలకు బోనాలు సమర్పించడం ఐదేండ్లగా ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు. కాళికామాతకు బోనాలు సమర్పించారు. కార్యక్రమాల్లో కృష్ణవేణి హైస్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో బుధవారం రాత్రి గ్రామ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించారు. గ్రామ బొడ్రాయి, ఆంకాలమ్మ, ముత్యాలమ్మ, సత్తెమ్మ దేవతలకు బోనాలను సమర్పించారు. గురువారం శాస్త్రీయ ప్రకారంగా వన భోజనాలకు వెళ్తారని గ్రామ పెద్దలు తెలిపారు. స్నేహపూర్వక వాతావరణంలో బోనాలు, వనవాసం జరుపుకుంటున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

విద్యార్థులకు షూ పంపిణీ

చిట్యాల, ఆగస్టు 14: మండలంలోని వట్టిమర్తి ప్రథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థులు సీఐ బూరుగు శ్రీనివాస్, నర్రా కిశోర్ రెడ్డి పాఠశాలలో విద్యార్థులకు రూ.30 వేల విలువైన షూ, టై, బెల్టులు, ఐడీ కార్డులను అందజేశారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే పూర్వ విద్యార్థి సీఐ బూరుగు శ్రీనివాసు జడ్పీహెచ్ఎస్ షూ, సాక్స్‌లను, పాఠశాల ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్, శీలం మధుసూదన్ టై, బెల్టులను అందజేశారు. కార్యక్రమాల్లో సింగిల్ విండో మాజీ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, రాం పల్లి రాంఫెల్, హెచ్ఎం పందిరి రమేశ్, జానకి, ఎస్.నరేశ్, మేడి హరికృష్ణ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానితులను అదుపులోకి తీసుకోవాలి :డీఎస్పీ

నీలగిరి, ఆగస్టు 14 : నల్లగొండ పట్టణంలో అనుమానాస్పందంగా కనబడిన వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి అన్నారు. స్థాని క ఎన్‌జీ కళాశాల సమీపంలో బుధవారంఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలో భాగంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్ కుమార్, మహిళ ఎస్ఐ విజయబాయి సిబ్బంది ఉన్నారు.

నకిరేకల్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా ఉమారాణి

ఉమారాణి

నకిరేకల్, ఆగస్టు 14 : నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌పై 16 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ పదవీ ఖాళీ అయింది. దాంతో నూతన మున్సిపల్ చైర్మన్ ఎన్నిక అయ్యేంత వరకూ ప్రస్తుతమున్న వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణీకృష్ణమూర్తిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అధికారికంగా ఆమె గు రువారం ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది.

ముత్యాలమ్మ విగ్రహ ఊరేగింపు

శాలిగౌరారం, ఆగస్టు 14: మండల కేంద్రమైన మార్కెట్ కాలనీలో ప్రతిష్ఠించనున్న ముత్యాలమ్మ విగ్రహాన్ని మంగళవారం స్థానిక మార్కెట్ కాలనీలో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి నీళ్లు ఆరబోసి కొబ్బరికాయలు సమర్పించుకున్నారు. అనంతరం గ్రామ శావారులోని ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహదాత బొడ్డు నగేశ్, చామల మహేందర్‌రెడ్డి, కల్లూరి నాగరాజు గౌడ్, సైదులు, సోమయ్య, మహేశ్, సురేశ్, నాగరాజు పాల్గొన్నారు.

సెమీ రెసిడెన్షియల్ నిర్మాణ పనుల పరిశీలన

మునుగోడు,ఆగస్టు14: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సెమీ రెసిడెన్షియల్ నిర్మాణ పనులను ప్రత్యేకాధికారి ఏడీ శ్రీనువాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కత్తుల రవీందర్, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వట్టిమర్తి మాజీ సర్పంచ్ రామచంద్రం మృతి

చిట్యాల, ఆగస్టు 14 : మండలంలోని వట్టిమర్తి మాజీ సర్ప ంచ్, సీపీఎం నాయకుడు రాచమళ్ల రామచంద్రం అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. వట్టిమర్తి గ్రా మానికి మొదటి సర్పంచ్‌గా నర్రా రాఘవరెడ్డి పనిచేసిన తర్వాత 28 ఏండ్ల పాటు రా మచంద్రం సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేశారు.

హైవేపై చోరీ

నకిరేకల్, ఆగస్టు 14 : నకిరేకల్ పట్టణశివారులో బుధవారం రాత్రి హైదరాబాద్-విజయవాడ హైవేపై గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన మర్రి శ్రీను, మౌనిక దంపతులు కొంత కాలంగా సూర్యాపేటలో నివాసం ఉంటున్నారు. పని నిమి త్తం భార్యభర్తలిద్దరూ స్కూటీకి నార్కట్‌పల్లికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. నకిరేకల్ శివారులోకి రాగానే పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మౌనిక చేతిలో ఉన్న బ్యాగు ను లాక్కెళ్లారు. వారూ తేరుకుని చూసేసరికి దొంగలు పారిపోయినట్లు తెలిపారు. బాధితుడు శ్రీను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ

కట్టంగూర్, ఆగస్టు 14 :బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కట్టంగూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందువులను రక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పబ్బు వెంకన్న గౌడ్, గున్నాల నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

బూరుగు అంజన్న స్ఫూర్తితో ఉద్యమించాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం

బూరుగు అంజయ్య విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్, ఆగస్టు 14 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, ఈదులూరు మాజీ సర్పంచ్ బూరుగు అంజన్నను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. అంజయ్య వర్ధంతిని ఈదులూరులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న విగ్రహానికి ఎమ్మెల్యే వీరేశం పూలమాల వేసి నివాళులర్పించారు, గ్రామంలో నూతంగా నిర్మించి విజ్ఞాన కేంద్రం ప్రారంభించి మాట్లాడారు భూమి, భుక్తి, విముక్తి పోరాటంలో నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత అంజయ్యకే దక్కుతుందన్నారు. సీసీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిలా కార్యదర్శి ఇందూరు సాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, అరుణోదయ విమలక్క, రాయి కృష్ణ, వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, కొమురయ్య పాల్గొన్నారు.

17 నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర

నల్లగొండ రూరల్, ఆగస్టు 14: ఈ నెల 17 నుంచి ఎల్ఆర్ఆర్ దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ పై ప్రతి గ్రామ పంచాయతీకి బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బృందంలో నీటి పారుదల శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉంటారని తెలిపారు. జిల్లాలోని 15 మండలాల టీములకు శిక్షణ ఇవ్వగా, ఈనెల 16 న 16 మండలాల బృందాలకు ఎల్ఆర్ఎస్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ తీసుకున్న బృందాలు 17న పూర్తి స్థాయిలో పరిష్కారం చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ మురళి, ఈడీఎం దుర్గ రావు, డీటీసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీఓలు, తాసీల్దార్, డిప్యూటీ తాసీల్దార్లు, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్లు రెవెన్యూ ,ఎంపీఓలు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థులకు షూ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన డీఈఓ భిక్షపతి

రామగిరి, ఆగస్టు 14: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి అన్నారు. నల్లగొండలోని కత్తాల్ గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం కంచర కుంట్ల వెంకట్‌రెడ్డి పాఠశాల విద్యార్థులకు అందించిన షూ పంపిణీ చేసి మాట్లాడారు. దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు సహాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దండెంపల్లి సరోజ, హెచ్ఎం విజయలక్ష్మి, 11వ వార్డు ప్రముఖులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జూడాల నిరసన

● కోల్‌కత్తాలో మౌనిత దేశ్‌నాథ్ హత్యకు ఖండన

నల్లగొండ నిరసనలో పాల్గొ